




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 274 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/- | ఆదివారం 03 మే 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## భారత్–పాక్ ఉద్రిక్తతలు..
# పీఎం మోదీతో అజిత్ డోభాల్ భేటీ

**ప్రధాని మోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ సమావేశమయ్యారు.**

మే 6, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఆ దాడికి భారత్ బదులిచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో మంగళవారం మరో కీలక సమావేశం జరిగింది. ప్రధాని నరేంద్రమోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ భేటీ అయ్యారు. ప్రస్తుత భద్రతా పరిస్థితిపై చర్చించారు. వీరిద్దరి మధ్య భేటీ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం.



ఇదిలాఉంటే.. కేంద్ర హోంశాఖ కూడా కీలక సమావేశం నిర్వహించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే దానిపై పౌరుల్ని సమాయత్తం చేసేందుకు మే 7న (బుధవారం) మాక్ అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు నిన్న కేంద్రహోం శాఖ ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆ శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడి తప్పిదం చేసినవారికి, ఘోర కుట్రలో భాగస్వాములైన వారికి కనీవినీ ఎరగని చావుదెబ్బ తప్పదని హెచ్చరించిన భారత ప్రధాని నరేంద్రమోదీ.. ఆ దిశగా కీలక నిర్ణయాలు తీసుకునేలా కనిపిస్తున్నారు. ఈ క్రమంలో రేపు నిర్వహించనున్న మాక్ డ్రిల్స్ అధికారులతో పాటు సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోంగార్డులు, ఎన్సీసీ/ ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువకేంద్రాలు, కళాశాలలు/ పాఠశాలల విద్యార్థులను దీనిలో భాగస్వాముల్ని చేయనున్నారు. శత్రుదాడి జరిగినప్పుడు స్వీయరక్షణతో పాటు విద్యార్థులు, యువకులు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించాలని హోంశాఖ తెలిపింది.

### 259 లొకేషన్లలో సెక్యూరిటీ డ్రిల్..

జాతీయ స్థాయిలో రేపు జరగనున్న మాక్ డ్రిల్ను 259 ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ఈ డ్రిల్కు సంబంధించి ఈ రోజు జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, సివిల్ డిఫెన్స్ చీఫ్స్ ఉన్నారు. 2010లో నోటిఫై చేసిన 244 సివిల్ డిఫెన్స్ డిస్ట్రిక్ట్పైనా ప్రత్యేక దృష్టి సారించారు. రాజస్థాన్, పంజాబ్, జమ్మూకశ్మీర్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లోని జిల్లాలే ప్రధానంగా అందులో ఉన్నాయి. 259 లొకేషన్లను మూడు కేటగిరీలుగా విభజించారు. కేటగిరీ–1లో 13, కేటగిరీ–2లో 201, కేటగిరీ–3లో 45 ప్రాంతాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్, విశాఖపట్నాన్ని ఎంపిక చేశారు. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్పై భారత్ కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. దీనిలోభాగంగా సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ దేశంతో వాణిజ్యం, రాకపోకలను నిషేధించింది. గగనతలాన్ని మూసివేసింది. దీంతోపాటు త్రివిధ దళాలు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ తరుణంలో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోన్న పాక్.. అంతర్జాతీయ వేదికల్లో భారత్పై అక్కసు వెళ్లగక్కుతోంది. భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై నేడు ఐరాస భద్రతా మండలిలో ఒక క్లోజ్డోర్ సమావేశం జరిగింది. తన సభ్యత్వాన్ని అడ్డంపెట్టుకొని భారత్ వ్యతిరేక తీర్మానం చేయాలని తొలుత పాక్ భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇస్లామాబాద్ బహిరంగ అణు బెదిరింపులపై చాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల ఆ దేశం క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని ప్రశ్నించాయి.

# పోరాడండి.. వెనకుంటాం: భారత్‌కు అమెరికా హామీ

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని అమెరికా మరోసారి హామీ ఇచ్చింది.

మే 6, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల వేళ అమెరికా కీలక ప్రకటన చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా న్యూఢిల్లీ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని పునరుద్ఘాటించింది. ఈ మేరకు అగ్రరాజ్య ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ వెల్లడించారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలబడాలి. అందుకోసం న్యూఢిల్లీ చేసే అన్ని ప్రయత్నాలకు మేం మద్దతు అందిస్తాం.



ఉగ్రవాదం పై పోరాటం కోసం భారత్కు శక్తివనరులతో సహకారం అందిస్తాం. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఇది కూడా భాగమే. భారత్తో బంధం ఎంత ముఖ్యమో ట్రంప్ యంత్రాంగం అర్థం చేసుకుంది. ఉగ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పు ఎలాంటిదో కూడా మాకు తెలుసు" అని మైక్ జాన్సన్ వివరించారు. ఈ విషయంలో గతంలోనూ అగ్రరాజ్యం భారత్కు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్ ప్రధాని మోదీతో ఫోన్లో మాట్లాడారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్.. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారికి శిక్ష పడేలా తీసుకునే చర్యలకు సహకారం అందిస్తామన్నారు. ఉగ్రవాద పోరులో ఇరుదేశాలు కలిసి పోరాడుతాయని అగ్రరాజ్యాధినేత తెలిపారు. పహల్గాం దాడికి పాల్పడినవారిని కలలో కూడా ఊహించనివిధంగా శిక్షిస్తామని ఇప్పటికే ప్రధాని మోదీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా కేంద్రం కీలక నిర్ణయాలకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కన్పిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో యుద్ధ అప్రమత్తతకు కేంద్రం పిలుపునివ్వడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. గగనతల దాడుల గురించి హెచ్చరించే సైరన్ల వ్యవస్థ పనిచేసేలా చూడాలని, ఇతరత్రా స్వీయరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర హోంశాఖ సోమవారం అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. దీనిపై నేడు సమీక్ష కూడా చేపట్టారు.

# రేవంత్ వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపం: కేటీఆర్

ఉద్యోగ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు.

హైదరాబాద్, మే 6, (రిపబ్లిక్ న్యూస్): ఉద్యోగ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సీఎం వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.



"భారాస పార్టీని, మమ్మల్ని ఎన్ని తిట్టినా భరించాం.. భరిస్తాం. తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతినేలా సీఎం మాట్లాడితే సహించేది లేదు. రేవంత్రెడ్డి అత్యంత అసమర్థ, దక్షతలేని సీఎం అని నిన్నటి వ్యాఖ్యలతో తేలిపోయింది. ఢిల్లీ పార్టీలను నమ్మొద్దని ప్రజలకు కేసీఆర్ చిలుకకు చెప్పినట్లు చెప్పారు. ఎన్నికలప్పుడు కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షరసత్యాలయ్యాయి. పరిపాలన చేతగాదని.. సీఎం రేవంత్రెడ్డి కాడి కిందపడేశారు" అని కేటీఆర్ విమర్శించారు.

# తెలంగాణలో ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో కాంగ్రెస్
## :కేంద్రమంత్రి బండి సంజయ్

రాష్ట్రానికి పెద్దగా భావించే ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.



కరీంనగర్, మే 6, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రానికి పెద్దగా భావించే ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రభుత్వ పెద్దగా ప్రజల్లో ధైర్యం నింపాల్సిందిపోయి అధైర్యాన్ని నూరిపోస్తూ రాష్ట్రం పరువు తీస్తున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం నడపలేమనే స్థితిలో కాంగ్రెస్ ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే అడ్డగోలు హామీలు ఇచ్చారని.. ఇప్పుడు ఆరు గ్యారంటీలు అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. కేంద్రమంత్రులు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని సీఎం చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చిన రాహుల్గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

# బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించిన ఏపీ ప్రభుత్వం

వైకాపా హయాంలో నిలిపివేసిన బేబీ కిట్ పథకాన్ని ఏపీ ప్రభుత్వం పునరుద్ధరించింది.

అమరావతి, మే 6, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా హయాంలో నిలిపివేసిన బేబీ కిట్ పథకాన్ని ఏపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. నవజాత శిశువుల ఆరోగ్యం కోసం 11 వస్తువులతో కూడిన బేబీ కిట్ను అప్పటి తెదేపా ప్రభుత్వం పంపిణీ చేసేది. వైకాపా ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేయగా.. తాజాగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది.




# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె వాయిదా

తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది.

హైదరాబాద్, మే 6, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా పడింది. ఉద్యోగుల సమస్యలపై ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నవీన్ మిత్తల్, లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్లతో కూడిన ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యలకు పరిష్కారాలను సూచించనుంది. వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. డిపోల్లో ఏయే సమస్యలు ఉన్నాయి? ఉద్యోగులు, కార్మికుల పని భారం, ఒత్తిళ్లు వంటి అంశాలకు పరిష్కారం ఏమిటనే అంశాలపై జేఏసీ నేతలతో మంత్రి చర్చించారు.






## తాత్కాలిక వాయిదా మాత్రమే.. జేఏసీ నేతలు

దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ చర్చల్లో ఆర్టీసీ విలీనం అంశంపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ చర్చల అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ.. "ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాం. ప్రైవేటు విద్యుత్తు బస్సుల గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వమే విద్యుత్తు బస్సులు కొని ఆర్టీసీకి ఇచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. కారుణ్య నియామకాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని మేం కోరాం. విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వేతన సవరణ గురించి సానుకూలంగా స్పందించారు. మా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చేలా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమ్మెను కొంత కాలం పాటు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం. మా సమస్యల్ని పరిష్కరించకపోతే కచ్చితంగా మళ్లీ సమ్మె తేదీని ప్రకటిస్తాం. ఇది తాత్కాలిక వాయిదా మాత్రమే" అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయాలని ఇటీవల టీజీఎస్ఆర్టీసీ ఐకాస నేతలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు చర్చలకు ఆహ్వానం రాకపోతే.. మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ క్రమంలోనే సోమవారం భారీ కవాతు సైతం నిర్వహించారు. ఈ క్రమంలో తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్–1 అక్రమాల కేసు..
# క్యాస్‌సైన్ డైరెక్టర్ ధాత్రి మధు అరెస్టు

ఏపీపీఎస్సీ గ్రూప్–1 అక్రమాల కేసులో 'క్యాస్‌సైన్ మీడియా' సంస్థ డైరెక్టర్ ధాత్రి మధును పోలీసులు అరెస్టు చేశారు.

హైదరాబాద్, మే 6, (రిపబ్లిక్ న్యూస్): ఏపీపీఎస్సీ గ్రూప్–1 అక్రమాల కేసులో 'క్యాస్‌సైన్ మీడియా' సంస్థ డైరెక్టర్ ధాత్రి మధును పోలీసులు అరెస్టు చేశారు. గ్రూప్–1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో హైదరాబాద్లోని అతడి కార్యాలయంలో మధును ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విజయవాడకు తరలిస్తున్నారు.

మూల్యాంకన కుంభకోణం కేసులో మధును ఏ2గా కోర్టులో పోలీసులు హాజరుపరచనున్నారు. హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్ మూల్యాంకన నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా కొటేషన్ విధానంలో పొందిన క్యామ్సైన్ సంస్థ.. ఇతర విషయాల్లోనూ అవకతవకలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కుంభకోణంపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసుస్టేషన్ లో నమోదైన ఎఫ్ఐఆర్ నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులను ఏ1గా చేర్చిన విషయం తెలిసిందే.




## ఉగ్రదాడిపై సమాచారమున్నా..
# ఎందుకు భద్రత కల్పించలేదు..?:ఖర్గే

ఉగ్రదాడి గురించి ఇంటెలిజెన్స్ సమాచారంతోనే కాశ్మీర్ పర్యటనను ప్రధాని మోదీ రద్దు చేసుకున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

మే 6, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం ఉగ్రదాడి వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. పహల్గాంలో మరింత భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. 'సంవిధాన్ బచావో' పేరుతో రాంచీ వేదికగా నిర్వహించిన సభలో ఖర్గే ఈ విధంగా స్పందించారు. "దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది. అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా " అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్ పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని మల్లికార్జున ఖర్గే మరోసారి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా దేశమే తొలి ప్రాధాన్యమన్నారు. రాజకీయ విభేదాలకంటే జాతీయ ఐక్యతే ముఖ్యమన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఖర్గే.. ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడమే మోదీ విధానమని ఆరోపించారు. ఆదివాసీ నేతలను భయపెట్టే ధోరణిని అవలంబించకూడదని కేంద్రానికి సూచించారు.



# ఒక వ్యక్తిని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దు:ఎంపీ ఈటల

తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

హైదరాబాద్, మే 6, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఈ ప్రాంతంలో రైల్వే, విద్యుత్, టెలిఫోన్ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఒక వ్యక్తిని, ఒక పార్టీని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దన్నారు. సోమవారం ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఈటల ఈ విధంగా స్పందించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రమని సీఎం రేవంత్ పేర్కొనడం సరికాదు. ధాన్యం దిగుబడి, జీఎస్డీపీ, వృద్ధిరేటు, అత్యధిక బడ్జెటాయి వంటి అంశాల్లో అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం ధ్వంసం చేస్తున్నారు. కొత్త రాష్ట్రమే అయినా తడబాటు లేకుండా గొప్పగా పురోగమిస్తున్నామని గతంలోనే చెప్పాను. 2014లోనే తెలంగాణ సొంత పన్నుల ఆదాయం రూ.29వేల కోట్లు. ఏటా రూ.5వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల ఆదాయం పెరిగేది. 2023–24లో రూ.1.19లక్షల కోట్ల ఆదాయం రాష్ట్రానికి వచ్చింది. పన్నేతర ఆదాయం కూడా 2014లోనే రూ.6వేల కోట్లు.. 2023–24లో రూ. 20వేల కోట్లు ఉంది. కేంద్రం పంపిణీ చేసే పన్నుల ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోంది" అని ఈటల రాజేందర్ వివరించారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1856 : ఉత్తర ధృవాన్ని చేరిన తొలి వ్యక్తిగా రికార్డు సృష్టించిన రాబర్ట్ పియరీ జననం (మ. 1920).
- 1861 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు మోతీలాల్ నెహ్రూ జననం (మ. 1931). (చిత్రంలో)
- 1868 : రష్యా జారు చక్రవర్తి రెండో నికోలస్ జననం (మ. 1918).
- 1910 : ఇంగ్లాండు చక్రవర్తి ఏడవ ఎడ్వర్డ్ మరణం (జ. 1841).
- 1910 : ఇంగ్లాండు చక్రవర్తిగా ఐదవ జార్జి పదవిలోకి వచ్చాడు.
- 1932 : సంగీత విద్వాంసుడు మల్లాది వెంకట సత్యనారాయణ రావు జననం (మ. 1996).
- 1953 : బ్రిటను మాజీ ప్రధానమంత్రి టోని బ్లెయిర్ జననం.
- 1954 : మైలు దూరాన్ని 4 నిమిషాలలోపు పరిగెత్తిన తొలి వ్యక్తిగా రోజర్ బాన్నిస్టర్ రికార్డు సృష్టించాడు.


రాబర్ట్ పియరీ


మోతీలాల్ నెహ్రూ


నికోలస్


ఎడ్వర్డ్


జార్జి


వెంకట సత్యనారాయణ రావు


టోని బ్లెయిర్


రోజర్ బాన్నిస్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ఈ సీజన్ మాకు కలిసి రాలేదు.. హైదరాబాద్ హెడ్ కోచ్

**ఈ సీజన్ సన్రైజర్స్ హైదరాబాద్కు కఠినంగా సాగుతోందని, ఆటగాళ్ల ప్రదర్శనలో నిలకడ లోపించింది అని ఎస్ఆర్హెచ్ హెడ్కోచ్ అన్నారు.**



ఐపీఎల్ 2025 సీజన్లో భాగంగా సోమవారం ఉప్పల్ వేదికగా దిల్లీ క్యాపిటల్స్ , సన్రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో సన్రైజర్స్ ప్లేఆఫ్స్ ఆశలు ఆవిరయ్యాయి. ఈ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. తర్వాత వరుణుడి రాకతో హైదరాబాద్కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. ఈ సీజన్లో ఇప్పటివరకు 11 మ్యాచ్లు ఆడిన ఎస్ఆర్హెచ్ కేవలం మూడింట్లో మాత్రమే విజయం సాధించి ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్ అనంతరం జట్టు ప్రధాన కోచ్ డానియల్ వెటోరి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. "మేం ప్రతి మ్యాచ్ దూకుడుగా ఆడాలని అనుకోలేదు. ఈ సంవత్సరం పరిస్థితులు మేం ఊహించిన విధంగా లేవు. గత సంవత్సరం మనం చాలా హైస్కోరింగ్ మ్యాచ్లు చూశాం. కానీ ఈసారి కాస్త భిన్నంగా ఉంది. హైదరాబాద్ పిచ్లు బ్యాటింగ్కు అనుకూలించలేదు. రెండు పిచ్లు 250o స్కోర్లకు వీలుగా ఉంటే. నాలుగు పిచ్లు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉన్నాయి. అదే సమయంలో స్పిన్నర్లకు సహకరించలేదు. కొత్త బంతిని కొట్టడం బ్యాటర్లకు ఇబ్బందిగా మారింది. బంతి బ్యాట్ మీదకు రాలేదు" అని వెటోరి వివరించాడు. అలాగే సోమవారం దిల్లీ క్యాపిటల్స్ జరిగిన మ్యాచ్ విషయాన్ని కూడా ప్రస్తావించాడు. "దిల్లీతో మ్యాచ్కు ముందు మేం 10 మ్యాచుల్లో కేవలం మూడు మాత్రమే గెలిచాం. కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితుల్లో సోమవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మా టీమ్ అద్భుతంగా దిల్లీని 133 పరుగులకు కట్టడి చేసింది. కానీ వరుణుడు మా ఆశలపై నీళ్లు చల్లాడు. మొత్తానికి ఈ సీజన్ మాకు కలిసిరాలేదు. మా ఆటగాళ్ల ప్రదర్శనలో నిలకడ లోపించింది. మహ్మద్ షమీకి ఇది నిజంగా కఠినమైన సీజన్. కానీ అతడు మంచి ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నించాడు" అని డానియల్ వెటోరి తెలియజేశాడు.

## 6400 కీ..మీ.. 36 దేశాలు.. ఏడారులు.. ఇసుక తుపానులు :సిల్క్ రోడ్ కథ చెప్పిన పూరి జగన్నాథ్

**పూరి మ్యూజింగ్స్'లో భాగంగా పూరి జగన్నాథ్ సిల్క్ రోడ్ గురించి వివరించారు.**



దర్శకుడు పూరి జగన్నాథ్ మరో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. సిల్క్ రోడ్ గురించి వివరించారు. ఈ రోడ్లో ప్రయాణించడం ఎంతో ప్రమాదకరమని ఆ రూట్లో వెళ్తే ప్రాణాలతో వస్తారో, లేదో కూడా తెలియదని చెప్పారు. 'పూరి మ్యూజింగ్స్' పేరుతో ఆయన వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తాజాగా సిల్క్ రోడ్ గురించి వివరించారు. "పూర్వం చైనా నుంచి యూరప్ వరకూ ఒక కనెక్టింగ్ రూట్ ఉండేది. దాని పేరు సిల్క్ రోడ్. అప్పట్లో చైనా సిల్కు యూరప్లో విపరీతమైన డిమాండ్ ఉండేది. సిల్క్ బిజినెస్ కోసం ప్రారంభమైన రూట్ ఇది. 36 దేశాలను కలుపుతూ.. 6,400 కిలోమీటర్లు ఉండేది. చైనా, మంగోలియా, పాకిస్థాన్, ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్, కజికిస్థాన్, సిరియా, టర్కీ ఇలా అన్ని దేశాలు కనెక్ట్ అయి ఉంటాయి. అయితే, ఈ రూట్లో వెళ్తే ప్రాణాలతో వస్తారో, లేదో ఎవరికీ తెలియదు. అంత ప్రమాదకరంగా ఉంటుంది. ఎందుకంటే ఎన్నో ఎడారులను దాటుకుంటూ వెళ్లాలి. ఇసుక తుపానుల మధ్య ప్రయాణం చేయాలి. పైగా విపరీతమైన ఉష్ణోగ్రతలు ఉండేవి. ఒంటెలు, గుర్రాలు లేకుండా ఎవరూ ప్రయాణం చేయలేరు. చైనా నుంచి టర్కీకి చేరాలంటే ఒక సంవత్సరం పట్టేది. "ఈ రోడ్ ద్వారా ఇండియా నుంచి సిల్తో పాటు మసాల, కుంకుమ, దాల్చిన చెక్క, మిరియాలు ఎగుమతి చేసేవారు. చైనా నుంచి ఏనుగు దంతాలు, రోమ్ నుంచి బంగారం, వెండి ఎగుమతి చేసేవారు. ఇలా రకరకాల బిజినెస్లు జరిగేవి. ఈ రోడ్ వల్ల ఇస్లాం, బుద్దిజం, క్రిస్టియానిటీ అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి వచ్చేసేవి. మొదటిసారి చైనా వాళ్లు పేపర్, గన్ పౌడర్ తయారుచేశారు. వాటిని ప్రపంచమంతా కొనాల్సి వచ్చింది. ఆ రూట్ చంఘిజ్ ఖాన్ ఎంపైర్ చేతిలో ఉండేది. వాళ్లే దౌర్జన్యం చేసేవారు. మార్క్ పోలో ఈ రూట్ను ఉపయోగించుకుంటూ పేపర్, బొగ్గు అమ్మడం ప్రారంభించారు". "ఈ రూట్ మధ్యలో దోపిడీ దొంగలు దాడి చేసేవారు. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి అందరూ వెయ్యి ఒంటెలతో ప్రయాణించేవారు. ఈ రూట్లో వ్యాపారం చేయాలంటే కత్తి పట్టుకొని బయల్దేరాలి. 1500 సంవత్సరాల పాటు ప్రపంచమంతా ఈ దారినే వాడింది. ఈ రూట్లో బిజినెస్ చేయడానికి అందరూ ఒక ప్రత్యేక భాష ఉపయోగించేవారు. దాని పేరు మాలి. ఆ తర్వాత సముద్రమార్గం కనిపెట్టడం వల్ల ఈ సిల్క్ రోడ్డు ప్రయాణాన్ని తగ్గించేశారు. వరల్డ్ గ్లోబలైజేషన్కు మొదటి కారణం ఈ సిల్క్ రూటే సంస్కృతి, టెక్నాలజీ, మతాలు ఇలా ఎన్నో అంశాలు అందరూ ఎక్స్ఛేంజ్ చేసుకునేవారు. ఇప్పటికీ కొంతమంది ట్రావెలర్స్ ఈ సిల్క్ రోడ్లో ప్రయాణం చేస్తున్నారు" అని పూరి వివరించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## నా అహం కంటే మీపై ప్రేమే ఎక్కువ.. క్షమాపణలు చెప్పిన సోనూనిగమ్

కొన్ని రోజులుగా సింగర్ సోనూనిగమ్ పేరు వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన కర్ణాటక ప్రేక్షకులకు క్షమాపణలు చెప్పారు. బెంగళూరులో జరిగిన కాన్సర్ట్లో ఆయన చేసిన కామెంట్స్పై 'కర్ణాటక రక్షణ వేదిక' బెంగళూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు ధర్మరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా ఈ మొత్తం వ్యవహారంపై సోనూనిగమ్ క్షమాపణలు చెప్పారు.



మొదట తన కామెంట్స్పై పూర్తి వివరణ ఇచ్చిన ఆయన.. తాజాగా మరో పోస్ట్లో కన్నడ ప్రేక్షకులకు క్షమాపణలు చెప్పారు. "సారీ కర్ణాటక.. నాకున్న అహం కంటే మీపై ఉన్న ప్రేమే ఎక్కువ" అని పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్గా మారింది. ఇక ఈ వ్యవహారంపై వారంలోగా ఇన్వెస్టిగేషన్కు హాజరుకావాలంటూ బెంగళూరు పోలీసులు గాయకుడికి నోటీసులు జారీ చేశారు. మరోవైపు, సోనూపై 'కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' బ్యాన్ విధించినట్లు సమాచారం. ఏప్రిల్ 26న సోనూ నిగమ్ బెంగళూరులో ఓ కాన్సర్ట్ నిర్వహించారు. ఆ వేదికపై ఆయన పాటలు పాడుతున్న సమయంలో ఓ అభిమాని కన్నడలోనే పాడాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో, సహనం కోల్పోయిన సోనూ పాడడం ఆపేసి కన్నడ ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. భాషపై తనకు కూడా అభిమానం ఉందన్నారు. కన్నడ భాషను తాను గౌరవిస్తానని చెప్పిన ఆయన.. ఆ అభిమాని తనను బెదిరించినట్లు మాట్లాడటం నొప్పించిందన్నారు. పహల్గాం విషాదాన్ని ప్రస్తావించారు. 'పహల్గాంలో ఏం జరిగిందో దానికి ఇదే కారణం. కచ్చితంగా ఇదే.. ఇప్పుడు మీరు ఏం చేశారో అలాంటి కారణంగా ఆ దాడి జరిగింది. డిమాండ్ చేసే ముందు కనీసం మీ ముందు ఎవరున్నారో చూడండి' అని ఘాటుగా స్పందించారు.

రిపబ్లిక్
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## ఇంటి చిట్కాలు

## చింతపండుతో జుట్టు రాలడం నుంచి తెల్ల జుట్టు వరకు అన్నీ

### హెయిర్ ప్రాబ్లమ్స్ మాయం, అయితే, ఎలా వాడాలో తెలుసా?

**ఎటువంటి ఖర్చు లేకుండా.. కొన్ని సహజ పద్ధతుల ద్వారా జుట్టును సంరక్షించుకోవచ్చు. కొన్ని ఇంటి చిట్కాలు జుట్టు సమస్యల్ని తగ్గిస్తాయి. జుట్టు రాలడం, పాడిబారడం, తెల్ల జుట్టు వంటి అన్నీ హెయిర్ ప్రాబ్లమ్స్కి చింతపండు బాగా ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.**

ఈ రోజుల్లో బిజీ లైఫ్స్టైల్, దుమ్ము, కాలుష్యం కారణంగా మన జుట్టు పొడిగా, నిర్జీవంగా మారుతుంది. అంతేకాకుండా.. తెల్ల జుట్టు, తలపై వెంట్రుకలు రాలిపోవడం, పొడి జుట్టు వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న వయసులోనే చాలా మంది జుట్టు సమస్యలతో సతమతమవుతున్నారు. దీంతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టడానికి చాలా మంది ఖరీదైన షాంపూలు, కండిషనర్లు సీరమ్లు వాడుతున్నారు. అయినా సరైన ఫలితాలు ఉండటం లేదు. అయితే, ఎటువంటి ఖర్చు లేకుండా.. కొన్ని సహజ పద్ధతుల ద్వారా జుట్టును సంరక్షించుకోవచ్చు. కొన్ని ఇంటి చిట్కాలు జుట్టు సమస్యల్ని తగ్గిస్తాయి. జుట్టు రాలడం, పాడిబారడం, తెల్ల జుట్టు వంటి అన్నీ హెయిర్ ప్రాబ్లమ్స్కి చింతపండు బాగా ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు. అవును మీరు విన్నది నిజమే.. వంటల్లో ఉపయోగించే చింతపండుతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టవచ్చు. చింతపండుతో ప్రయోజనాలేంటి, జుట్టు సమస్యలకు చెక్ పెట్టడానికి దాన్ని ఎలా వాడాలో ఇక్కడ తెలుసుకుందాం.

### చింతపండులో పోషకాలు



చింతపండులో జుట్టు ఆరోగ్యానికి మేలు విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, జింక్, ఐరన్ మూలాలు ఉంటాయి. ఇవి జుట్టుకు తగిన పోషణనిస్తాయి. జుట్టును ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా ఎన్నో ప్రయోజనాల్ని అందిస్తుంది. చింతపండుతో కలిగే ప్రయోజనాలేంటి, దాన్ని ఎలా వాడాలో ఇప్పుడు తెలుసుకుందాం.



### చుండ్రుకు చెక్




చింతపండులో ఉండే విటమిన్ సి తల చర్మాన్ని శుభ్రపరుస్తూ చుండ్రును తొలగించడంలో సహాయపడుతుంది. ఇందుకోసం కొంచెం చింతపండును నీటిలో నానబెట్టి రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయం చింతపండును బాగా నలిపి, నీటిని ఫిల్టర్ చేయండి. ఆ నీటిని జుట్టు, తలపై రాయండి. అరగంట తర్వాత, జుట్టును శుభ్రమైన నీటితో వాష్ చేసుకోండి. ఈ రెమెడీని కొన్ని రోజులు పాటు ఫాలో అయితే చుండ్రు సమస్య తగ్గుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

### మృదువైన జుట్టు




జుట్టును మృదువుగా చేయడానికి, చింతపండు నీటిని ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఒక గిన్నెలో చింతపండు నీళ్ళు తీసుకోండి. అందులో అలోవెరా జెల్ కలిపి జుట్టుకు అప్లై చేయాలి. ఈ హెయిర్ మాస్క్ ఆరిన తర్వాత, మీ జుట్టును షాంపూతో కడగాలి. ఈ హెయిర్ మాస్క్ జుట్టును హైడ్రేటెడ్గా ఉంటుంది. జుట్టుకు కావాల్సిన తేమను అందిస్తుంది. దీంతో జుట్టు మృదువుగా మారడంతో పాటు మెరుస్తుంది.

### జుట్టు పెరుగుదల



చింతపండు నీరు జుట్టు పెరుగుదలకు కూడా ప్రభావవంతంగా ఉంటుంది. చింతపండు నీరు జుట్టు పెరుగుదలను ప్రోత్సాహిస్తుంది. ఇందుకోసం చింతపండు నీటితో జుట్టును క్రమం తప్పకుండా మసాజ్ చేయాలి. మసాజ్ చేయడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల జుట్టు వేగంగా పెరగడం ప్రారంభమవుతుంది.

### జుట్టు రాలడం ఆగిపోతుంది



ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం. జుట్టు రాలడంతో బాధపడుతుంటే చింతపండు నీరు మీకు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, జింక్, ఐరన్ జుట్టును బలంగా మారుస్తాయి. దీంతో జుట్టు రాలడం తగ్గిపోతుంది. ఇందుకోసం కొంచెం చింతపండును నీటిలో నానబెట్టి రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయం చింతపండును బాగా నలిపి, నీటిని ఫిల్టర్ చేయండి. ఆ నీటిని జుట్టు, తలపై రాయండి. అరగంట తర్వాత, జుట్టును శుభ్రమైన నీటితో వాష్ చేసుకోండి.

**జుట్టు చివర్లు చిట్లిపోవడం ఆగిపోతుంది**

జుట్టు పొడిబారడం వల్ల తరచుగా చివర్లు చిట్లడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చింతపండు నీరు జుట్టుకు తేమను అందిస్తుంది. అంతేకాకుండా చివర్ల చిట్లిపోవడాన్ని నియంత్రిస్తుంది. ఇందుకోసం చింతపండు నీళ్ళను హెన్నా లేదా కలబంద జెల్ తో కలిపి జుట్టుకు అప్లై చేయాలి. ఆ తర్వాత ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. బాగా ఆరిన తర్వాత జుట్టును వాష్ చేసుకోవాలి. ఇది జుట్టులో తేమను నిలుపుతుంది. దీంతో, జుట్టు పొడిబారడం ఆగిపోతుంది

### తెల్ల జుట్టు

ఈ రోజుల్లో చాలా మంది తెల్ల జుట్టుతో బాధపడుతున్నారు. చిన్న వయసులోనే జుట్టు నెరసిపోతుంది. ఇలాంటి వారికి చింతపండు బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం చింతపండు నీరును తీసుకోండి. ఆ తర్వాత ఈ నీటిని హెన్నాతో కలపండి. ఆ తర్వాత జుట్టుకు బాగా అప్లై చేసి.. కాసేపు ఆరనివ్వండి. జుట్టు బాగా ఆరిన తర్వాత తేలికపాటి షాంపూతో వాష్ చేసుకోండి. ఇలా చేయడం వల్ల జుట్టు నల్లగా మారుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. **గమనిక** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.